

# ప్రేమలేఖ

★

శ్రీ చలం

నిన్నరాత్రి సు—— నాకు తన జీవితంలోని రహస్యాలు చెప్పాడు యెందుకో హటాత్తుగా. వెన్నెట్లో కూచుని తన మొదటి ప్రియురాలి సంగతి చెప్పకు వొచ్చాడు, 'రొమాన్సు' జరిగి పోయింతరవాత మళ్లీ పునశ్చరణ చేసుకున్నప్పుడు 'ఒరిజనల్' ఆనందలో యే కొంచెం భాగమో హృదయంలో వెలుగుతుంది. ఆ రొమాన్సు రోజుల్లోని, తొందరా, బాధా, సందేహమూ, తాపమూ వొదిలిపోయి, స్వచ్ఛమైన ఆనందమే మిగులుతుంది. కొందరు స్నేహితులతో చెప్పకుంటారు. కొందరు కథలు అల్లుతారు. కొందరు గీతలు గీస్తారు.

అతని సంగీతపు శిష్యురాళ్లలో మొదటి ఆమె, అతని ప్రియురాలు. నేను యీనాటికి చివరి శిష్యుణ్ణి. నన్ను తీసుకుపోయి నాకు ఆమెను చూపాడు. ఆమెచేత పాడించాడు. ఆమె పాట బావుంది. అంతెకన్న ఆమె బావుంది. ఆమెని భర్త వొదిలేశాట్ట. ఎందుకు వొదిలాడో! అని ఆలోచించాను. అట్లా ఆలోచించుకుంటే, చక్కని కథ వొస్తుంది. నా స్నేహితుడు ఆమెతో స్నేహం మానేశాడు. కారణం అడిగితే, 'ఎన్నాళ్లూ?' అని నవ్వాడు.

ఆమె తండ్రి యెందుకో నన్ను గట్టిగా పట్టుకున్నాడు. ప్రతిరోజూ రమ్మంటాడు. మళ్లీ ఎదో చిక్కుకి తయారవుతున్నానా అనిపిస్తోంది. అద్రుష్టవంతుడు సు—. అతని సంగీతం విని, స్త్రీలు వొలిచి వొచ్చారంటే ఏమీ వింతలేదు. కాని సంగీ

తం ఆపగానే సమ్మోహనమంత్రం చెదిరిపోదా అనుకుంటాను. అందుకని అంతసేపూ పాడుతోనే వుండాల్సివొస్తే...అన్ని అవస్థలలోనూ...తలుచుకో ఎంత నవ్వొస్తుందో! అట్లాంటి కథ వ్రాస్తే! కాని సంగీతంవినా సు— లోనే ...స్వతహాగా మనిషిలోనే...ఆకర్షణవుంది. అట్లా గాక, సంస్కారమున్న స్త్రీలు కూడా, ఈ నాటకవేషధారుల్ని తుచ్ఛుల్ని కూడా వాలిచి పరిగెత్తారని వింటామే! పాపం!

ఈ వూళ్లో చాలామంది పేరుకెక్కిన పాటకు లున్నారు. చాలా జమీందారీ కుటుంబాలు వున్నాయి. ఈ పాటకులకీ, ఆ కుటుంబ గోషా స్త్రీలకీ చాలా scandals వున్నాయి. ఈ తండ్రులూ, భర్తలూ, మరి చదువులకీ, సంగీతాలకీ, యీ మొగవాళ్లని యెందుకు వుపాధ్యాయులుగా కుదురుస్తారో తెలీదు. మళ్లీ scandals ని భరించ లేరు. అహభావం. తమ గొప్పతనంలో నమ్మకం. 'నా అంత ధనవంతుడి, కులీనుడి భార్య ఈ నిర్భాగ్యపు సంగీతంవాణ్ణి మోహిస్తుందా' అనే నిర్లక్ష్యం. మోహించడానికి వీలు దొరకదు కదా అనే ధైర్యం– కాని స్త్రీతలుచుకుంటే, మార్గం కనిపెట్టడం ఎంతసేపు! ఏమాత్రమూ తెలివిలేని స్త్రీలు, ప్రపంచమంటే మెరగని వాళ్లు, యీ మోహవ్యాపారంలో అద్భుతమైన బుద్ధికుశలతతో ప్రవర్తించడం చూశాను, నేను. ఈ మోహం కామంతో చేరి, ఒక్క 'ఇన్‌స్టింక్టు' అయిపోయింది. అందువల్లనే దారులన్నిటినీ గొప్పవెలుగుతో నించి, చూపుతుంది మార్గం.

ర—వొళ్లు బాగా లేదు. మళ్లీ బాధపడుతున్నాడు. ఒక్కసారి complaint చెయ్యకండా, ఎవరినీ నిందించకండా, ధీరంగా అట్లా బాధని వోర్చుకునే పిల్లల్ని, ఏపాప మెరగని పిల్లల్ని చూస్తే నేను దేవుడే వుండి, దయాపరుడూ, సర్వశక్తిమంతుడే ఐతే, యిట్లాంటి ఘోరాలు యీ ప్రపంచంలో వుండడానికి వీల్లేదు అనుకుంటాను. కాని ప్రజలందరూ యిల్లాంటి పాపలేనేమో, ఏమీ తెలియని, బిడ్డలేనేమో అనిపిస్తుంది. పూర్వకర్మ అని సమర్థిస్తారు. కాని వింత ఘోరపాపాలు చెయ్యనీ, యీ కష్టం, యీ రోగం విధించడానికి, యే దేవుడికీ, యే కర్మకీ, యే మాయకీ అధికారంలేదు. ఈ తప్పుకి నిన్ను శిక్షిస్తున్నానని చెప్పి, అనంతంగా నరకంమంటలో తోసే, క్రిష్టియన్లదేవుడు, అధికదయాపరుడు, యీ హిందువుల కర్మదెయ్యంకన్న. ఆక్రిస్టియన్లు అయినా, 'యీ బాధకి అర్థమేమి'టని అడిగితే 'ఈశ్వరేచ్ఛ!' అని గుడ్లుతేలవేస్తారు.

సగం బండికిందనలిగిన కుక్క తనబాధకి అర్థంతెలీక, యజమాని ముఖంచూసి తోక ఆడిస్తూవుంటే, అన్నిటికీ రక్షించగలదని నమ్మి తల్లివంక గుడ్లు తిప్పి, ఆతల్లి చేత్తో పోసిన చేదుమందులు మింగి, పిల్ల బాధతో మూలుగుతో వుంటే, పిల్లినోట్లోచిక్కిన చిలక రక్షించమని అరుస్తూవుంటే, దేవుడులేడు, ఇదంతా గుడ్డిమర, యీలోకం నోరుమూసుకుని అనుభవించవలిసిందే అని అనుకుంటే సరిపోతుంది గాని, దేవుడు వున్నాడే అనుకుంటే, ఆ దేవుడు రాక్షసో, నీచుడో అనాల్సివొస్తుంది. ఎప్పుడో దీనికంతా అర్థం తెలుస్తుందిట! ఇంత బాధల కోర్చి, నలిగి, చీలికలైన తరవాత —ఎందుకా జ్ఞానం! ఇదంతా మన మంచికేట!

ఇంతబాధద్వారా మంచితెచ్చుకోవలిసిన గతిలో ఎందుకు పడ్డామో పోనీ, మాకేం తెలీదని వొప్పుకోరు కద, యీ మతదురహంభావులు! సందేహించే నన్ను మూరుడంటారు. జ్ఞానభిక్ష పెట్టమంటే, rot బోధిస్తారు.

నా వుత్తరానికి రా—చాలా కోపంగా జబాబువ్రాశాడు. నేను వ్రాసినవన్నీ అబద్ధాలని నమ్మాడు. పైగా, మొన్నో సంగతులు అతనికి నేను వ్రాయనేలేదు. ఎందుకంటే స్త్రీమీద నిందలుమోపడం నాకు

మనస్కరించదు. అసలే యుగయుగాల్నించి స్త్రీని తిట్టగలిగినంతా తిట్టారు. ఈనాటికీ సృష్టి అనాదినించి పేరుకున్న బానిసత్వం కింద మూలుగుతోంది ఆమె. ఆమెలోని దుర్గుణాలకీ, అల్పత్వానికీ. యీ సంఘదౌర్జన్యమే కారణం, అంతేగాక, నిన్ను తలుచుకున్నంత మాత్రాన, స్త్రీలందరూ నాకు పూజ్యులౌతారు. నన్ను మోసగించినా, బాధించినా, వాళ్లమీద నిందలు మోపడం నీచంగా తోస్తుంది. లోకమంతా ఇంత అన్యాయం చేస్తున్నారే స్త్రీని, నేను కూడా వాళ్లతో కలిసి రాళ్లు రువ్వనా? స్త్రీ చేసే ప్రతిమోసంలోనూ, పురుషుడి అక్రమదౌర్జన్యం కనిపిస్తుంది నాకు. చిన్నపిల్లలమీద చాడీలు చెప్పి, దెబ్బలు కొట్టించే వాణ్ణి చూస్తే నీకెట్లా వుంటుంది? సులభంగా పురుషుడికి కోపం తెప్పించవొచ్చు స్త్రీమీద. సులభంగా శిక్ష విప్పించవొచ్చు. పురుషుడి అధీనురాలుగద! నాకథలలోనూ అంతే. స్త్రీలకి జరిగిన అన్యాయాలే వ్రాసినందుకు యీ వాంగ్మయమణులందరికీ కోపం నామీద. వివాహాన్నే నిర్మూలం చెయ్యాలని చూస్తున్నాడని అపవాదతో ప్రజల్ని బెదిరించి, వ్రాసి, నామీద ద్వేషాల్ని పురికొల్పి బాగుపడాలని చూస్తున్నారు కపటులు. ప్రతిదినమూ యీ పురుషులు సాగించే దౌర్జన్యం నిరసించేందుకుగాని, విసర్జించేందుకుగాని ధైర్యంలేక, నేను పురుషుల్ని అన్యాయంగా చిత్రిస్తున్నానని, ఒక మిషను యేరి కనిపెట్టి విలపిస్తున్నారు.

—మ్మ చాలా వుత్తమురాలని రా— నిశ్చితాభిప్రాయం. అర్హత లేని స్త్రీని తనశక్తి నంతటితోనూ గుడ్డిగా ప్రేమించే వుత్తమపురుషుడంత నిర్భాగ్యుడు వుండబోడు. రా--వంటివాడు స్త్రీ చేతుల్లో యిట్లా వివేకాన్ని వొదులుకున్నాడే! ఏం చెయ్యను? అతను కళ్ళు తెరిచిన రోజున యేం జరగబోతోంది? నా మాటలు నమ్మడు. motives ఆరోపిస్తాడు. నేనుగాక యింకొకరు చెపితే లక్ష్యంచెయ్యడు. దీనినే, యిలాంటి స్థితినే, inevitable trasedyనే, కర్మ, fateఅంటారు. ఎంత ప్రేమించీ, ప్రయత్నించీ కూడా మన అప్తులు వినాశంవేపు నడవకుండా అడ్డుపడలేము. అట్లాంటప్పుడే యీ జీవితంలోని భయంకర అగాధాలు గోచరిస్తాయి. మనుష్య ప్రయత్నం యీ మహాప్రవాహంలో యెంత అల్పమో తడుతుంది.

ఇట్లాంటి limitations నించి, స్వల్పత్వాల నించి, అంధత్వంనించి యెట్లా మనిషి తప్పుకోడం? అన్నీ గొప్ప గుణాలు వుండి, ఒక్క చిన్ని లోపంవల్ల అధోగతి పాలైనవారున్నారు. ఆ గుణాలే, ఒక్కవైపున ఔన్నత్యాన్నీ, ఒక వైపున సంకుచితత్వాన్ని యిస్తాయి. ఒక స్థితిలో వుపయోగపడి సౌఖ్యాన్నిస్తాయి, ఒక స్థితిలో, ఒక కాలంలో, కిందికీడుస్తాయి. పూర్తిగా దుష్టులై ఒక్క చిన్ని వివేకంవల్ల చాలా వుచ్ఛదశని పొందినవాళ్లున్నారు. గుణాలతో సంబంధంలేని కర్మవల్లనా? యీశ్వరేచ్ఛవల్లనా? కాదు. అట్లానే ఐతే కర్మకీ, యీశ్వరుడికీ అర్థం వుండదు- యీ ప్రపంచ కారణాలమీద ఆధారపడని results అవి. Miracles. పైగా యీలోకం moral values మీద నిలబడి వుందంటారు. ప్రపంచాన్ని పరీక్షించరు. అట్లాంటి moral values వున్నాయని విశ్వసించడం వారికి యిష్టం, సులభంకనక అట్లానమ్మి, ఆ ప్రకారమే లోకం జరుగుతున్నట్టుగా మాయకప్పుకుంటారు. వాదించి, వాస్తవాన్ని చూపితే, పరలోకంలో యీ లోపాలూ, అన్యాయాలు, compensate అవుతాయని నమ్ముమంటారు. వూరికే సులభంగా "దుర్గుణాలు త్యజించు, సద్గుణాలు పెంపొందించు" అని బోధిస్తారు. గుళ్లల్లో, బళ్లల్లో, పుస్తకాల్లో ఏదో తాళ్లు తెంపడంలాగూ, మొక్కల్ని పెంచడంలాగూ, లోకం చూడగా చూడగా, మొదట మనిషికి, పుటక

వల్లవున్న గుణాలనించి, ఎవరూ తప్పించుకోడం సాధ్యమనుకోను. అభివృద్ధి లేకపోలేదు. కాని యుగాలు పట్టేట్టువుంది--ఒక జీవితంలోజరిగే పనికాదు. మనం చూసే యీ అభివృద్ధి వుత్తమోసం—నటన. దుర్గుణం మానాడంటే పైకి కనపరచడం మానాడన్నమాట. లేనిసుద్గుణం కలిగిందంటే, పైకి నటించడం కొత్తగా నేర్చాడన్నమాట. సాంఘిక శిక్షలూ, బాల్యంలో శిక్షణా, యింత మాత్రపు మార్పును కలగచెయ్యగలవు. నిరాపయకరమైన సిటిజెన్‌గా తయారుచేస్తాయి వ్యక్తుల్ని. కాని అసలు characterని మార్చలేవు—conductనే గాని! కాని కొందరు గొప్ప exceptional వ్యక్తులు యే ఆశయతీవ్రత వల్లనో, నిశ్చయశక్తి వల్లనో తమలో అద్భుతమైన మార్పుల్ని చూపుతారు. కాని అక్కకూడా నిజంగా మారారా అనే సందేహమే? నేను కూడా చివరికి కర్మ వేదాంతాన్ని చేరుకున్నానా అని భయం.

ఏపని చేసినా యీశ్వరనామోచ్చారణతో చేస్తే, పవిత్రమవుతుంది యీ దేశానికి. నేను ప్రచారంచేసే, యీ అవినీతినంతా, ఒక మతంగా చేసి, కళ్లుతేలేసి, వేషంమార్చి, మడిగా వుచ్చరిస్తే, లోటలువేస్తో మింగుతారు. కొన్ని శ్రుతులూ, పురాణాలూ, ఆధారంగా కోట్ చెయ్యాలి. లేకపోతే నా అంత గొప్పగా రాసినాడూ, నీతులు బోధించేవాడూ లేడని self-advertisement చేసుకోవాలి, ఎవరిచాతనన్నా వ్రాయించుకోవాలి. ఈకొత్త వాంగ్మయంకూడా, vested interests మీద, పీఠాధిపతుల హాస్తలమీదిగా నడుస్తోంది. వారి కటాక్ష వీక్షణాలకు బద్ధుణ్ణై, వారి అనుగ్రహమూ, రికమెండేషన్ సంపాయించాలి. లేక యేదో ఒక సమితిలో చేరాలి. వారు పదిచోట్ల నన్నుతిట్టి, యిరవైచోట్ల నా పేరు చప్పరించారా, యింక వుప్పు పుట్టదు. నలుగు రైదుగురు గొప్పవారిచేత... వారిగొప్ప ధనంలోగాని, వైద్యంలోగాని, గోతులు తవ్వడంలోగాని ఎట్లాగో ఒకలాగు గొప్పతనంవున్న వాళ్లచేత ఉపోద్ఘాతాలూ, ఎప్రీసియేషన్లూ వ్రాయించుకోవాలి. అప్పుడు అవినీతి నీతిగానూ, తెలివితక్కువ, వివేకంగానూ, శైలి అద్భుతంగానూ మారుతుంది ప్రజల దృష్టిలో!

ఎప్పుడూ స్నేహమూ, admiration, appreciation, ఇట్లాంటివాటికై నాకు చాల స్వల్పంవ్యామోహం. ఎందుకంటే వాటికంటే నాకానందమిచ్చే విషయాల్ని నిరంతరమూ జీవితం నాకు కటాక్షిస్తోంది. కాని నీకోసం, నాపైని నీకున్న గౌరవం అధికమయ్యేందుకు, నీ మనసులోనేగాక, ప్రపంచంలో నేను కొంత విలువకలిగిన వాణ్ణని నీకు చూపటంకోసం, నేను కీర్తినీ, ఘనతనూ ఆశిస్తాను. కాని ప్రజల ఆదరణని పొందాలంటే, ఆత్మని గొంతునులిమి, అబద్ధపు మేఘాలవెనక పాతెయ్యాలిసివొస్తుంది. స్వార్థరహితమైన ప్రేమను అర్థంచేసుకునేజ్ఞానం యీ లోకానికి యింకా లేదు. కనకనే యేపనిగాని క్షుద్రఫలాలకై చేసినట్టు కనబడకపోతే, యేవో వొక ఆరోపణలను వెతికి చేస్తారు. ఎంత మోసగాడైతే, యెంత తెలివిగా తన స్వార్థాన్ని కప్పి పుచ్చగలవాడైతే, అంత పూజ్యుడు ప్రజలకి. ప్రజల్ని అనుసరించి, వాళ్ల 'సింపతీ'ని యాచించే మనిషి వాళ్లకి ఆప్తుడు; వాళ్ళ భూషణదూషణాల్ని నిర్లక్ష్యంచేసేవాడు విరోధి.

కీర్తినీ, మెప్పునీ ప్రతి artistకోరతాడు. నేను కీర్తిని తలుచుకున్నప్పుడల్లా, ఆకీర్తి నీకళ్ళలో చూసి గర్వపడాలనే ఆశవొక్కటే నన్ను ప్రోత్సాహపరుస్తుంది. ద్వేషింపబడీ, హర్షింపబడీ, యేవిధంగానైనా నీప్రేమకి అర్హుణ్ణి అని నీకు నిరూపించడమే, నా జీవితపరమావధి. నాకథలు అట్లావుంచు. నా ప్రవర్తన, నా వూహాలు, నాకా

ర్యాలు, అన్నీ—చిన్నతనంనించి, ఎప్పుడూ ప్రపంచంనించి, నాబడిరోజుల్లోకూడా, అడిగి ద్వేషాన్ని తెచ్చుకున్నాయి. సాధారణ స్నేహాలకి నాహృదయం మారుపలకదు. అందువల్లనే నిరంతరమూ ఏకాకిని. Popularity ఎప్పుడూ artiasకి ప్రతిబంధకం. అందరూ తిడుతున్నన్నాళ్ళు, ఎవరి సంగతీ యోచించకండా వ్రాస్తాడు. కాని అందరూ హర్షిస్తే, వ్రాసేప్పుడు తన fansకి ఎక్కడ కోపం తెప్పిస్తానో అని భయపడతారు.

మొన్న నన్ను గౌరవించాలని రాజమండ్రిలో చిన్న సభ చేశారు స్నేహితులు. క్రిష్ణశాస్త్రి, దామెర్ల వెంకట్రావు, ప్రకాశరాయుడు- వీళ్ళు వొచ్చారు. అప్పుడు రామ్మూర్తిని గురించి ఈ ఒకరు ఒక కథ చెప్పారు:

“అ—లో ఒక అమ్మాయికీ వెంకటచలానికీ స్నేహం. ఆమెకి వెంకటచలం చదవడానికి తన ‘చిత్రాంగి’ నిచ్చాడు. ఆ పుస్తకం చదివి, ఆమె అతనిలో మాట్లాడ్డం మానేసింది. అప్పుడు అతను ఆమెకి

If you do not like them, burn my books.

But why scorch me with thy looks?

అని వ్రాశాడు. కాని నాకు వెంకటచలంమీద కోపం వస్తే

I will scorch him with my ooks.

But never will I burn his books"

అన్నాడు.

ఇంతవరకూ స్వేచ్ఛగా నా చిత్తం వొచ్చినట్టు వ్రాస్తున్నాను, ఎవరు చదువుతారో నాకు తెలీదు.

ఒక వేదాంతం పుస్తకం చదువుతున్నాను. ఈ వేదాంతి యీ ప్రపంచమంతా మిథ్య అనీ, యీ సుఖదుఖ్ఖాలన్నీ, మన పంచేంద్రియాలు, మనసు కల్పిస్తున్న స్వప్న మనీ విశ్వసింపచెయ్యాలని ప్రయత్నిస్తున్నాడు. కాని యీ దృశ్యమంతా మాయేకానీ, యీ ఆనందమంతా మనో కల్పితమే కానీ, సర్వమూ శూన్యమే ఐనా కూడా, మన ప్రేమమాత్రం సత్యము. దాన్ని యీ భ్రమా సముద్రంలో కలిపెయ్యడానికి వొప్పుకోను. ప్రేమ అనేది లేదూ? అది మనోజాడ్యమా? నువ్వు, నువ్వనే మనిషి లేనే లేవనీ, నిన్ను నా మనసు కల్పించిందనీ అంటారు. అయితే నన్ను నేనే కల్పించుకున్నానా? నీవు నేనూ లేరా అసలు? నీవంటిదాన్ని నా మనసు కల్పించుకోగలిగిందంటే, అంతకన్న గౌరవం నాకేమున్నది? నా మనసులో అనేకమంది కథా నాయికలకు జన్మనిచ్చాను. అనేకమంది ఆంధ్రుల మనస్సులను కలవరపెట్టినవాళ్ళు, వాళ్ల పూనిక తీకమత నొందించిన వాళ్ళు యెదిరించి యేడిపించి, అహంభావాన్ని కాలు కింద రాసిన వనితల్ని సృజించినా.

కాని అందరినీ మించి, నా జీవితానికంతా వెలుగు నివ్వగల అద్భుత వ్యక్తిని నిన్నూ సృజించుకున్నానా? నిన్ను కన్న తలిదండ్రులకు కొన్నాళ్ళు, నిన్ను కటాక్షించాడని యీశ్వరుడికి thanfulగా వున్నాను. కాని వాళ్లెవరూ కారు, నిన్ను నేనే కల్పించుకున్నా! నేనెంత ఉత్తమోత్తమ వ్యక్తిని, సౌందర్యోపాసకుణ్ణి ఐవుండాలి? నీవేళ్ల అందాన్ని, నీ చూపుల మృదుత్వాన్ని, నీ మెడ వొంపును, నీ దయని, నీ వాంఛని,...

వొప్పుకోను. నువ్వు లేవంటే నేనంగీకరించను. నువ్వు లేకపోతే, యీ ప్రపంచమే లేదు! ఈశ్వరుడే లేడు. అవును యీ ప్రపంచమే లేదంటారీ వేదాంతులు. వోడిపోయినాను. అంతం లేదు;- ఈ యోచనలకి. తప్పించుకోలేక, ఒకే గిరిలో యిటూ అటూ తిరుగుతుంది యీ వెర్రిమనసు.

నీ స్నేహితుల కోసం యింకా కొన్ని పుస్తకాలు నేను రాసినవి పంపమంటున్నావు. నువ్వు పంపమంటే ఎన్ని పుస్తకాలైనా, యెవరికైనా పంపుతాను. కాని యిట్లా పంచిపెట్టడం, నాకు సంతోషమనీ

నా పుస్తకాల ప్రచారానికి సహాయం చేస్తున్నాననీ అనుకుంటున్నావేమో! నీకోసం పంపడం సంతోషం. అంతే.

వాళ్ళు ధనికులు. కొనుక్కోకూడదా? ఈ దేశంలో మనుష్యులకి పుస్తకాలు కొనడం చాలా అనవసరంగా, ధనం వృధాగా పారపొయ్యడం లాగు కనపడుతుంది. దోవ్లో దొరికే, బాదమాకుల్నీ బంతిపూలనీ, బజారులో కొనవలసివొస్తే యెంత బాధ! అట్లా తోస్తుంది గావును. నేను పుస్తకాలు రాసిన పాపానికి; యీ పోస్టేజీ జుల్మానా! ఒక్కసారి బందరు రైల్లో ఒకాయన నా పక్కన కూచుని దైవమిచ్చిన భార్య తీసుకుని చదువుతున్నాడు. పక్కన రూపాయల సించీ వుంది. ఆయన గుడివాడలో దిగాలి. దిగలేదు. చదువుతున్నాడు. రైలు కదిలే దాకా, తలుపు పట్టుకు వేళ్లాడుతో చదువుతున్నాడు...

---


## జగదేకరంభ

జగదేకరంభయన నీమెయే జగదేకరంభ. రంభఅంటే దేహ సౌందర్యముచేతనేగాక శీలసౌందర్యముచే ప్రపంచాన్ని మెప్పించిన నారీరత్నము. చమత్కారమైన కథ.

గ్లేసు ప్రతి 1-కి 0-10-0 తపాలాఖర్చు వేరు:

## మిత్రద్రోహము

తిన్నయింటికి వాసాలెంచు సామెతనుబట్టి యల్లబడిన రసవంతమగు నవల. ఇదివర కిట్టి నవల వెలువడలేదు. అపరాధాన్వేషణము అత్యద్భుతము. గ్లేసు ప్రతి 1-కి 0-8-0

తపాలాఖర్చు ప్రత్యేకము.

ధనలక్ష్మి కంపెని,

సౌకారుపేట, మదరాసు.

## లీలా

లేక

## సురేంద్రనగరమణి

రసవంతమగు నవలారాజము

బాలురకు తలితండ్రులయందు భక్తియు, స్త్రీలకు పతియందలి ప్రేమయు, పురుషులకు రాజవిశ్వాసమును యీ గ్రంథపఠనచే యలవడును.

ప్రతి 1-కి రు. 1-0-0

ఆర్యన్ బుక్ డిపో,

19, తాండవరాయ మొదలివీధి, తిరువల్లిక్కేణి, మదరాసు.